క్లుప్తంగా

పొర్లుకట్టల పనుల పరిశీలన

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెం వద్ద జరుగుతున్న స్వర్ణముఖి నది పొర్లుకట్టల మరమ్మతు పనులను సోమవారం ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ ఆనందరావు పరిశీలించారు. పనుల నాణ్యత, వాడుతున్న మెటీరియల్‌ను తనిఖీ చేశారు. ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖి నది పొర్లుకట్టలు వరదల సమయంలో తరచూ కోతకు గురవుతున్నాయని తెలిపారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర నష్టం జరుగుతోందని చెప్పారు. ఎస్టిమేషన్‌లో చూపిన విధంగా పనులు నాణ్యతగా ఉండాలన్నారు. అవకతవకలు జరగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. అమ్మవారి ఆలయానికి ప్రస్తుతం పాలకమండలి లేకపోవడంతో పోలీస్, రెవెన్యూ, దేవదాయశాఖ వారి సమక్షంలో హుండీలను తెరిచారు. ఆలయ సిబ్బంది, మెప్మా సభ్యులు, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు కానుకలను లెక్కించారు. 116 రోజులకు రూ.67,68,889 నగదు, విదేశీ కరెన్సీకి సంబంధించి 131 యూఎస్‌ఏ డాలర్లు, 160 యూఏఈ దిరహమ్స్, ఏడు సౌదీ రియాల్స్, 20 యూకే పౌండ్స్, 30 సింగపూర్ డాలర్స్, 20 ఆస్ట్రేలియా కరెన్సీ, క్వార్టర్ కువైట్ దీనార్, 300 ఫేం హున్నై క్రోనర్, 100 సెంట్రల్‌బ్యాంక్ ఒమన్, ఐదు యూరో కరెన్సీ వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ బీ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ఓజిలి : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రదర్శించారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన బెండ, వంగ, మునగ, ఆకుకూరలు, క్యారెట్‌లను ప్రజలకు విక్రయించి అవగాహన కల్పించారు. పురుగు మందులు వాడని ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు, ఓజిలి మండల ఇన్‌చార్జిలు వీరరాఘవయ్య, జైతున్‌బీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

పెళ్లకూరు: మండలంలోని అర్లపాడు గ్రామంలో వ్యవసాయ భూముల్లోకి వెళ్లే దారి గుండా రాకపోకలను టీడీపీ నాయకుడు అడ్డుకున్నాడు. దీనిపై నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్ అండ్‌బీ స్థలం ఆక్రమణ తొలగింపు

గూడూరు రూరల్ : గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరులో ఆక్రమణకు గురైన ఆర్ అండ్ బీ స్థలాన్ని అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు మాట్లాడుతూ రోడ్డు పక్కనే విలువైన స్థలాలను కొంతమంది ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. రోడ్డు స్థలాలను ఆక్రమించుకునే వారి సమాచారం ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని లోతువాని గుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నవజీవన్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు హెచ్‌ఐవీ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ వ్యాప్తికి కారణాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ వివరించారు. హెచ్‌ఎం అన్నామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు.

ట్రాక్టర్ స్వాధీనం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో ఖనిజాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం సైదాపురం సమీపంలో తనిఖీలు చేపట్టారు. ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఖనిజాన్ని పరిశీలించారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గిరిజనుడి మృతి

చిట్టమూరు (చిల్లకూరు) : పొట్టకూటి కోసం రొయ్యల గుంతల వద్ద కాపలా ఉంటున్న ఒక గిరిజనుడు సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గూడూరు మున్సిపాలిటీలోని వీరారెడ్డిపల్లి గిరిజన కాలనీకి చెందిన క్రిష్ణయ్య(40) అనే గిరిజనుడు తన కుటుంబంతో కలిసి కోగిలిలోని రొయ్యల గుంతల వద్ద కాపలాకు కుదిరాడు. ఏమి జరిగిందో కాని క్రిష్ణయ్య సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అప్పటికప్పుడు అక్కడి నుంచి ఆటోలో తరలించి గూడూరు ప్రాంతంలో పూడ్చి వేశారు. రొయ్యల గుంత యజమానితో ఆదివారం ఏర్పడిన వివాదం వల్లే క్రిష్ణయ్య మృతి చెంది ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికులు చిట్టమూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు విచారణ చేపట్టారు. దంపతుల మధ్య ఏర్పడిన వివాదం వల్లే అతను ఆత్మహత్య చేసుకున్నాడని గిరిజనుడి కుటుంబ సభ్యులు ఫోన్‌లో చెప్పారు. స్థానిక వీఆర్వో నవీన్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చినబలరామయ్య తెలిపారు.

రైతన్నకు అందని సాయం



కొత్తపల్లి సమీపంలో పొలాన్ని దున్నుతున్న రైతు



తనియాలిలో వరి నాట్లు వేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

ఆరుగాలం కష్టపడి సాగు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందక రైతులు ఇబ్బందులు పడేవారు. పెట్టుబడి కూడా అందక, చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునేవారు. ఇది 2019 ఎన్నికలకు ముందు మాట. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకోవాలని సంకల్పించారు. వారికి రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500లను బ్యాంకు ఖాతాలో జమ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకున్నారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి రైతులను నిలువునా ముంచింది. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభమవుతున్నా పెట్టుబడి సాయం రూపాయి కూడా విదిల్చలేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మండలం	రైతుల సంఖ్య	రైతు భరోసా నాలుగేళ్లలో
దొరవారిసత్రం	3,740	రూ.11.22 కోట్లు
సూళ్లూరుపేట	3,700	రూ.11.10 కోట్లు
తడ	2,800	రూ.8.4 కోట్లు

దొరవారిసత్రం : సూళ్లూరుపేట వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో 12,857 మంది రైతులు ఉన్నారు. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమై సుమారు 2 వేల హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకూ అన్నదాతా సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ (2024–25) పథకం కింద ఇటీవల రూ.2 వేలు చొప్పున 10,240 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20 వేలు విడుదల చేసి ఉంటే విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు ఎంతగానో ఉపయోగపడేవని, ఇప్పటి వరకు సాయం గురించి పట్టించుకోకపోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. దీంతో అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు.

- అన్నదాతా సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఊసే లేని పథకం
- పెట్టుబడి కోసం రైతులకు తప్పని తిప్పలు
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా అందిన రైతు భరోసా

గతంలో క్రమం తప్పకుండా అందిన రైతు భరోసా

గత ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద నాలుగేళ్ల పాటు క్రమం తప్పకుండా ఏడాదికి రూ.13,500ల చొప్పున 10,240 మంది రైతుల ఖాతాల్లో రూ. 30.72 కోట్ల నగదు జమ చేసింది. కౌలుకింద సాగు చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు సైతం రైతు భరోసా వర్తింపజేసి ఆదుకుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు స్థానికంగానే ఎరువులు, పురుగు మందులు అందజేసింది. వ్యవసాయ సిబ్బందిని అందుబాటులో ఉంచి పంటల సాగులో మెళకువలు అందించింది. వ్యవసాయాన్ని పండుగలా మార్చింది.

రైతన్నకు భరోసా కరువైంది



ప్రస్తుతం రైతన్నకు ప్రభుత్వం ఇచ్చే భరోసా కరువైంది. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ఆ ఊసే ఎత్తడం లేదు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగినా పట్టించుకునే దిక్కులేదు. గత ప్రభుత్వం రైతుకు దన్నుగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు అందించి రైతులను ఆదుకోవాలి.

– వై.జయరామయ్య, కారికాడు

సాయం ఒకేసారి అందాలి



రైతుకు అందించే పెట్టుబడి సాయం కేంద్రం అందించే పీఎం కిసాన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే వాటా కూడా ఒకేసారి రైతుకు అందితే ఎంతగానో ఉపయోగపడుతుంది. చంద్రబాబునాయుడు ప్రకటించిన అన్నదాతా సుఖీభవ పథకం గురించి ఇప్పటి వరకు ప్రకటించలేదు. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తెచ్చుకున్నాం. సాయం ఎప్పుడు చేస్తారో చెబితే బాగుంటుంది.

– ఎం.రమణయ్య, తొగరాముడి

అమరుల త్యాగం చిరస్మరణీయం



వెంకటగిరి రూరల్ : అమరులైన పోలీసులకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ అరుణ్‌బోస్



వెంకటగిరిలో ర్యాలీ చేస్తున్న పోలీసులు



రాపూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటరాజేష్

వెంకటగిరి రూరల్/ వెంకటగిరి (సైదాపురం)/రాపూరు/కలువాయి : విధి నిర్వహణలో అశువులు బాసిన వారి త్యాగఫలం చిరస్మరణీయమని మండలంలోని వల్లివేడు సమీపంలోని 9వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ అరుణ్ బోస్ తెలిపారు. బెటాలియన్‌లో సోమవారం అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులను బహుమతులు అందజేశారు.

- వెంకటగిరిలో సీఐ ఏవీ రమణ అధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ చేశారు. ఎస్‌ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.
- రాపూరులో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో అమరవీరుల చిత్రపటానికి ఎస్‌ఐ వెంకటరాజేష్ పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు.
- కలువాయిలో అమరు వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలువాయికి చెందిన అనకర్ల కేశవులు జ్ఞాపకార్థం బస్టాండ్‌లో స్థాపించిన స్థూపం వద్ద సీఐ విజయ్‌కృష్ణ, ఎస్‌ఐ సుమ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ఎంఈవో శేషగిరిరావు, వైద్యులు రాజేష్, బీవీఎస్‌ఆర్ ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీ, కేశవులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో రోబోటిక్స్‌పై శిక్షణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం మెకానికల్ విభాగం విద్యార్థులకు సోమవారం బెంగళూరుకు చెందిన డైఫ్యాక్టో సంస్థ ఇండస్ట్రియల్ రోబోట్ కంట్రోల్ అండ్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి నందగోపాల్ మాట్లాడుతూ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్‌పై పరిశ్రమలు దృష్టి సారిస్తున్నాయన్నారు. వివిధ కార్పొరేట్ పరిశ్రమల్లో మెకానికల్ విభాగం విద్యార్థులకు ఉన్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను తెలియజేశారు. రోబోటిక్స్‌పై నైపుణ్యం, సాంకేతికతను పెంపొందించుకోవాలని సూచించారు. ఐదురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌వోడీ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలి

వెంకటగిరి రూరల్ : పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, అరవ మంజుల డిమాండ్ చేశారు. వారు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం రూ.6 వేలు ఇస్తున్నారని, దీంతో కుటుంబం గడవడం కష్టంగా ఉందన్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం రూ.26 వేల జీతం ఇవ్వాలని కోరారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు ప్రసాద్, సుబ్రమణ్యం, కార్మికులు పాల్గొన్నారు.

కండలేరులో 37.188 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 37.188 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయంలోకి వరద కాలువ నుంచి 350 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 9,500 క్యూసెక్కుల నీరు చేరుతోందని చెప్పారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 140, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దొరవారిసత్రం : సూళ్లూరుపేట నియోజకవర్గంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను విడతల వారిగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె సోమవారం మినమనముడి, శ్రీధనమల్లి, తొగరాముడి, మీజూరు గ్రామాల్లో పల్లె పండుగ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలో ఉపాధి హామీ కింద 22 పంచాయతీల్లో 20 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.1.40 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన, ఏపీవో భాస్కరయ్య, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సుగుణ, శ్రీనివాసులునాయుడు, రవీంద్రరెడ్డి, రాజేంద్రప్రసాద్, ఉదయ్, సుధాకర్, విజయ్, నాగేంద్రనాయుడు, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు, చెన్నప్పనాయుడుపేట, శిరసనంబేడు గ్రామాల్లో సోమవారం సిమెంట్ రోడ్డు నిర్మాణాలకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శంకుస్థాపన చేశారు. చెంబేడుకు రూ.10 లక్షలు, చెన్నప్పనాయుడుపేటకు రూ.8 లక్షలు, శిరసనంబేడుకు రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు నాగేంద్రరెడ్డి, మస్తాన్‌రెడ్డి, మురళీరెడ్డి, యుగంధర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓజిలి: కర్రబల్లవోలులో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ఓజిలి: గ్రామాల అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె సోమవారం పల్లె పండుగలో భాగంగా మండలంలోని పున్నేపల్లి, కర్రబల్లవోలు, నెమళ్లపూడిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌నాయుడు, నాయకులు మస్తాన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారావుయాదవ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి బాటలు

చిల్లకూరు : పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో పనులు చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నట్టు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కూరగాయల సాగుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం నాయుడుపేటలోని సీడీపీవో కార్యాలయంలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు పరిధిలో 47 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కూరగాయలు, ఆకు కూరలను పండించడంపై వ్యవసాయాధికారులు వివరించారు. ఉద్యానవన శాఖ అధికారిణి శారద, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల వ్యవసాధికారులు గణేష్, ప్రవీణ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నేదురుమల్లి పరామర్శ



తిరుపాల్ నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: మండలంలోని మిట్టపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొల్లంపల్లి కృష్ణ సోదరుడు తిరుపాల్ నాయుడు ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం మిట్టపాళెం చేరుకున్నారు. తిరుపాల్ నాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపాల్ నాయుడు కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట నాయకులు చింతల శ్రీనివాసులురెడ్డి, బొల్లంపల్లి కృష్ణ, కేశాని ప్రభాకర్‌బాబు, మాధమాల నారాయణరెడ్డి, వేముల వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి ఆశీర్వాదం



ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దారా రవి అన్న కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. వధూవరులు దార లక్ష్మణ్‌కుమార్, లక్ష్మీ శిరీషను ఆశీర్వదించారు. ఆయన వెంట కటకం జయరామయ్య, పాలేటి నాగార్జున, ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, చిందేటి వెంకటేశ్వర్లు, మీజూరు బాల తదితరులు ఉన్నారు.

వైభవంగా పోలేరమ్మ ఘటోత్సవం



ఘటానికి పూజలు చేస్తున్న దృశ్యం



ఘటం ఊరేగింపు

సైదాపురం: సైదాపురం గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో భాగంగా సోమవారం సాయంత్రం ఘటోత్సవానికి వైభవంగా పూజలు చేశారు. ఈ ఘటోత్సవం మంగళవారం రాత్రి వరకు కొనసాగుతుంది. జాతరలో భాగంగా సైదాపురంలోని అంకమ్మ ఆలయం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్ద వీఆర్వో, గ్రామ కమిటీ సభ్యుల సమక్షంలో ఘటానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. తూర్పువీధి వద్ద ప్రారంభమైన ఘటోత్సవం కుల పెద్దల ఇళ్ల వద్దకు చేరుకుంది. అక్కడ వారు ఘటానికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి తిరిగి మళ్లీ అంకమ్మ ఆలయానికి చేరుకుంది. మంగళవారం రాత్రి వరకు సైదాపురంలో ఉన్న అన్ని వీధుల్లోనూ ఘటాన్ని ఊరేగిస్తారు. బంధుమిత్రులతో సైదాపురంలో సందడి నెలకొంది.

నాయుడుపేటలో కాకాణికి ఘన స్వాగతం



గోమతి సెంటర్ వద్ద కాకాణికి స్వాగతం పలుకుతున్న సంజీవయ్య తదితర నాయకులు

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి సోమవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పెళ్లకూరు మండలం చిల్లకూరులో డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటిపై ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం చిల్లకూరు వెళుతూ నాయుడుపేటకు చేరుకున్నారు. ఆయనకు గోమతి సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఘన స్వాగతం పలికారు. నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, ఓట్టురు కిషోర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, చదలవాడ కుమార్, చంద్రారెడ్డి, మెస్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐ దురుసు ప్రవర్తనపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న కె.ధర్మప్రసాద్‌పై ఎస్‌ఐ బ్రహ్మనాయుడు దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ స్థానిక న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఒక సివిల్ వివాద ఘటనకు సంబంధించి వివరణ ఇవ్వడానికి ఈ నెల 18వ తేదీ సాయంత్రం న్యాయవాది ధర్మప్రసాద్‌ను ఎస్‌ఐ బ్రహ్మనాయుడు పోలీసు స్టేషన్‌కు పిలిపించారని తెలిపారు. న్యాయవాది వివరణకు ఎస్‌ఐ సంతృప్తి చెందకపోవడంతోపాటు దుర్భాషలాడారని పేర్కొన్నారు. సివిల్ వివాదంలో మీ జోక్యం ఏమిటని న్యాయవాది ప్రశ్నించడంతో ఎస్‌ఐ ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నేను ఎస్‌ఐని, నాకే ఎదురు చెబుతావా' అని దురుసుగా ప్రవర్తించాడని, అంతేగాక ఇద్దరు కానిస్టేబుళ్లతో న్యాయవాది ధర్మప్రసాద్‌ను తన చాంబర్ నుంచి బయటకు గెంటేశారని ఆరోపించారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కలిసి వినతి పత్రం అందజేయనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం న్యాయవాదులందరూ కోర్టు విధులను బహిష్కంచనున్నామని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పారిచెర్లవారిపాళెం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. ఆయన సోమవారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్, త్రోబాల్ పోటీల్లో తమ విద్యార్థులు జి.నవ్య శ్రీ, ఎస్‌కే గౌసియా, ఎస్.శ్రీతరుణి, సీహెచ్.నిషా, సీహెచ్.ఝాన్సీ, ఎం.ప్రవల్లి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. వీరు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. పీఈటీ కామేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపకన్నుకు నాయకుల నివాళి



పాపకన్ను రాజశేఖరరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ



అంత్యక్రియల్లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి

రాపూరు: రాపూరు మాజీ సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పాపకన్ను రాజశేఖరరెడ్డి(81)కు నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మృతదేహాన్ని సోమవారం ఉదయం నెల్లూరు నుంచి రాపూరు మండలం వేపినాపికి తీసుకువచ్చి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రంరెడ్డి, ఉదయగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయరెడ్డి, తిరుపతి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, నెల్లూరు రవీంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వరరెడ్డి, రాపూరు, కలువాయి, సైదాపురానికి చెందిన నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. వారికుటుంబ సభ్యులు పాపకన్ను నిరంజన్‌రెడ్డిని పరామర్శించారు.